క్లుప్తంగా

కులగణన నిర్ణయం అభినందనీయం



మంత్రి వేణుకు వినతిపత్రం అందజేస్తున్న దేవిడ్‌కుమార్ తదితరులు

రామచంద్రపురం: రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేయాలని నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని జై భారత్ సామాజిక విప్లవ రణభేరి అధ్యక్షుడు పిల్లి డేవిడ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను కలసి డేవిడ్‌కుమార్ తదితరులు వినతిపత్రం అందజేశారు. సమగ్ర కులగణనకి సంబంధించి ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి అవసరమైన ప్రభావశీలమైన విధానాల్ని ప్రణాళికలను రూపొందించేందుకు ఈ సమాచారం ఉపయోగపడుతుందన్నారు. ఈ మేరకు సమగ్ర కులగణన రాష్ట్ర ప్రభుత్వం వేయబోయే కమిటీ మంత్రి వేణు సారథ్యంలో జరగాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు.

18 నుంచి సువార్త సంగీత పండగలు

కపిలేశ్వరపురం: పడమర ఖండ్రికలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో మంగళవారం నుంచి క్రైస్తవ రక్షణ సువార్త సంగీత పండుగలు నిర్వహించనున్నట్టు చర్చి పాస్టర్ జి.రూబెన్ సోమవారం తెలిపారు. 18 నుంచి 21 వరకూ సాయంత్రం 6 గంటలకు నిర్వహించే కార్యక్రమాల్లో క్రైస్తవ ప్రబోధకులు విలియమ్స్, వి.స్టీవెన్, పాల్ ఇమ్మానుయేల్, జెఫన్యాశాస్త్రి ప్రసంగిస్తారన్నారు. జేకే క్రిస్టాఫర్, ఆకుమర్తి డానియేల్, షారోన్, ఫిలిప్, లిల్లియన్, నిస్సీ జాన్, ప్రభుభూషన్‌లు క్రైస్తవ గేయాలను ఆలపిస్తారన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన చైర్‌పర్సన్ శ్రీదేవి

రామచంద్రపురం: పట్టణంలోని ప్రధాన రహదారిలో మున్సిపల్ కార్యాలయం వద్ద పురపాలక సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. వైస్ చైర్మన్‌లు చింతపల్లి నాగేశ్వరరావు, కోలమూరి శివాజీ, డీఈ డి.దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా బహూకరణ



హైస్కూల్‌కు బీరువా అందిస్తున్న విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: తాము విద్యనభ్యసించిన పాఠశాలకు తమ వంతుగా ఏదో ఒకటి చేయాలన్న సంకల్పంతో నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులు తమ ఉపాధ్యాయులు రికార్డులను భద్రపరుచుకోవడానికి అనువుగా ఉండే విధంగా బీరువాను తయారు చేయించి సోమవారం అందజేశారు. ఈ ఏడాది పదో తరగతి బ్యాచ్‌లో 70 మంది విదార్థులు ఉండగా వారంతా డబ్బులు వేసుకుని బీరువాను తయారు చేయించారని పాఠశాల ప్రధానోపాధ్యాయిని కేకేఎల్ కుమారి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.మహాలక్ష్మి, డి.అప్పారావు, స్టాఫ్ కార్యదర్శి పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువలు నిర్మించాలి

కాజులూరు: తమ గృహావాసాల చుట్టూ మురుగునీరు ముంచెత్తుతుందని అధికారులు స్పందించి ఆదుకోవాలని గొల్లపాలెం ధనలక్ష్మీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నేత నిమ్మితి విజయ్, నాగార్జున తదితరులు కోరుతున్నారు. సోమవారం గ్రామంలో వారు విలేకరులతో మాట్లాడుతూ కాలనీలో డ్రైనేజీ సదుపాయం లేకపోవటంతో గృహావాసాల్లోని వృథానీరు బయటకు వెళ్లే మార్గాలు లేక ఇళ్ల మధ్యే పేరుకుపోయి ఎక్కడనీరు అక్కడే నిలిచిపోతుంది. రోజుల తరబడి నీరు నిలిచి ఉండటంతో భరించలేని దుర్వాసన వస్తుందని బాధిత ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయవరం: మండలంలోని ఖాళీగా ఉన్న రెండు వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీవో డి.శ్రీనివాసు తెలిపారు. సోమేశ్వరం, మాచవరం గ్రామాల్లో ఖాళీగా ఒక్కో వలంటీర్ పోస్టుకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, ఈ నెల 19 నుంచి 21 వరకూ ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవచ్చని చెప్పారు. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రతిని సంబంధిత పంచాయతీ కార్యదర్శికి అందజేయాలన్నారు.

ఆక్వాసాగుకు చేయూత

- పదెకరాల లోపు రైతులకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే
- జోన్ పరిధిలో 567 సర్వీసులకు సబ్సిడీ విద్యుత్
- హామీని నెరవేర్చిన సీఎం జగన్
- ఆనందం వ్యక్తం చేస్తున్న ఆక్వా రైతులు



కాజులూరు మండలంలోని ఆక్వా చెరువు

రామచంద్రపురం: ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా అన్నదాతలను ఆదుకునే విషయంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం వెనుకంజ వేయడం లేదు. రైతులకు అన్ని విధాలుగా ఆదుకునేందుకు కష్టనష్టాలను పక్కకుపెట్టి ముందుకు సాగుతుంది. ఇదే క్రమంలో ఆక్వా రైతులకు చేయూత నిచ్చేందుకు సిద్ధమైంది. అందులో భాగంగా వారికి యూనిట్ విద్యుత్ రూ.1.50లకు అందిస్తుంది. ఒక్క యూనిట్ పైనా రూ.5.50ల భారాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. ఎన్నికల ముందు ఆక్వా రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చడంతో రైతులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు చెబుతున్నారు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో కాజులూరు మండలంలో 6 వేల ఎకరాలు, కె.గంగవరం, రామచంద్రపురం మండలాల పరిధిలో 5300 ఎకరాలు, కపిలేశ్వరపురం మండలంలో 100 ఎకరాలు మొత్తం 11వేల 400 ఎకరాల్లో ఆక్వాకు సంబంధించి సాగు చేస్తుండగా సుమారుగా 667 వరకు విద్యుత్ సర్వీసులున్నాయి. చంద్రబాబు పాలనలో నామమాత్రంగా కూడా రైతులకు సబ్సిడీ ఇచ్చిన పాపాన పోలేదు. పాదయాత్రలో భాగంగా ఆక్వా రైతుల కష్టాలను స్వయంగా అప్పటి ప్రతిపక్ష నేత, ఇప్పటి సీఎం జగన్ రూ.1.50లకే యూనిట్ విద్యుత్‌ను అందిస్తానని హామీ నిచ్చారు. సీఎం కాగానే ఆ హామీని నెరవేర్చారు. అప్పట్లో అయిదు ఎకరాల లోపు ఉన్న ఆక్వా సాగు రైతులకు మాత్రమే సబ్సిడీ విద్యుత్‌ను అందించారు. పదెకరాలలోపు ఆక్వాసాగు చేసే రైతులకు కూడా సబ్సిడీ విద్యుత్ అందించాలని ప్రభుత్వం నిర్ణయించటంతో చిన్న సన్న కారు రైతులకు సైతం యూనిట్ రూ.1.50లకే అందించేందుకు వీలు కలిగింది. దాదాపుగా 95 శాతం రైతులకు సబ్సిడీ విద్యుత్ ప్రస్తుతం అందే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక వైపు యూనిట్ విద్యుత్‌ను రూ.7కు కొనుగోలు చేస్తూ రైతులకు రూ.1.50లకే అందిస్తూ ఆక్వా రైతులపై తనకున్న ప్రేమను చాటుకుంది. చంద్రబాబు హయాంతో పోలిస్తే సీఎం జగన్ పాలనలో విద్యుత్‌చార్జీలు తగ్గటంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో అత్యధికంగా కాజులూరు, కె.గంగవరం మండలాల పరిధిలో ఆక్వా సాగును రైతులు చేస్తున్నారు. తదుపరి రామచంద్రపురం మండలం, మండపేట నియోజకవర్గంలో కపిలేశ్వరపురంలోనూ తక్కువగా ఆక్వా సాగుతుంది. ముఖ్యంగా కాజులూరు మండల పరిధి తీర ప్రాంతం కావటంతో ఆక్వా సాగుకు అనుకూలంగా ఉంటుంది. కాజులూరు మండలంలోని తీర ప్రాంత పంట పొలాలు అధికంగా ముంపునకు గురవుతుంటాయి. ఈ మండలంలో అధికంగా ఆక్వాసాగును రైతులు చేస్తున్న రైతులు దాదాపుగా 95 శాతం ప్రభుత్వం కల్పిస్తున్న సబ్సిడీ మూలంగా లబ్ధి పొందనున్నారు.

హామీని నెరవేర్చారు



ఎన్నిలకలకు ముందు ఆక్వా రైతుల కష్టాలను స్వయంగా చూసిన సీఎం జగన్ అప్పట్లో ఇచ్చిన హామీని ఆయన నెరవేర్చారు. ఆక్వా రైతులకు విద్యుత్ యూనిట్‌కు రూ.1.50లకు ఇవ్వటం చాలా సంతోషంగా ఉంది. దీని వలన కష్టాల్లో ఉన్న ఆక్వా రైతులకు మరింత ఉపశమనం కలుగుతుంది. సబ్సిడీ ఇచ్చి రైతులను ఆదుకోవటంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– పెద్దిరెడ్డి వెంకటరమణ, ఆక్వా రైతు

సబ్సిడీతో రైతులకు ఊరట



సబ్సిడీ విద్యుత్ ఇచ్చి ఆక్వా రైతులను సీఎం జగన్ ఆదుకున్నారు. యూనిట్‌కు రూ.1.50లకే విద్యుత్ ఇవ్వటం మూలంగా నష్టాలలో ఉన్న రైతులు సైతం కోలుకునే వీలు కలుగుతుంది. గతంలో వచ్చే బిల్లుల కన్నా ప్రభుత్వం కల్పించిన ఈ ఊరట మూలంగా రైతులకు మేలు కలుగుతుంది.

– పిల్లి కృష్ణమూర్తి, ఆక్వా రైతు

వైభవంగా మల్లేశ్వరుని కల్యాణం



పార్వతీ సమేత మల్లేశ్వరుని కల్యాణ వేడుక

రామచంద్రపురం రూరల్: మండలంలోని యనమదలలో వేంచేసిన పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి కల్యాణం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం అంకురార్పణ, ధ్వజారోహణం, గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఆలయ అర్చకుడు అయిలూరి శ్రీనివాస్ బ్రహ్మత్వంలో కల్యాణ వేడుక కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కుక్కల గోవిందు, ఆలయ ఈఓ వి.శ్రీనివాస్ కల్యాణమూర్తులకు నూతన వస్త్రాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మున్సిపల్ టెక్నీషియన్లకు శిక్షణ

రామచంద్రపురం: మండపేట, రామచంద్రపురం పురపాలక సంఘ పరిధిలోని పంప్ టెక్నీషియన్స్, ఆపరేటర్లకు ఇంధన పరిరక్షణపై అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం పట్టణంలోని ఆర్ఆర్ గ్రాండ్ హోటల్‌లో నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ టీ శ్రీకాంత్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా డీఈ డి.దుర్గాప్రసాద్ శిక్షణనిచ్చారు. రెండు మున్సిపాలిటీలకు చెందిన ఆపరేటర్లు, టెక్నీషియన్లు పాల్గొన్నారు.

ఎరువుల వినియోగం తగ్గించాలి

కాజులూరు: భూసారానికనుగుణంగా పంటపొలాల్లో ఎరువులు వినియోగించాలని తద్వారా ఖర్చులు తగ్గి రైతులకు నికర ఆదాయం పెరుగుతుందని కరప డివిజన్ ఏడీఏ కె.బాబురావు అన్నారు. భూసార పరీక్షల వారోత్సవాల్లో భాగంగా సోమవారం గొల్లపాలెంలో వీఏఏలకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ దాళ్వా మాసూళ్లు పూర్తయిన అనంతరం వేసవిలో ప్రతి రైతు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకునేలా వ్యవసాయ శాఖ సిబ్బంది కృషి చేయాలన్నారు. పరీక్షల ఆధారంగా భూమిలో సహజ సిద్ధంగా ఏర్పడే నత్రజని, పాస్ఫరస్ వంటి ఎరువుల లభ్యతను గుర్తించి అవసరాన్ని బట్టి పైపాటుగా ఎరువులు వినియోగించవచ్చన్నారు. వీఏఏలు రమ్య, శిరీష, అనుషా తదితరులు పాల్గొన్నారు.



గొల్లపాలెంలో భూసార పరీక్షలపై వీఏఏలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వేసవిలో ఓఆర్ఎస్ అవసరం

తగిన మోతాదులో తాగడం తప్పనిసరి



బి.రామారావు, హెఇ, అంగర పీహెచ్‌సీ

కపిలేశ్వరపురం: మండే ఎండల్లో ఎక్కువగా తిరగడంతో శరీరంలో నీటి శాతం తగ్గిపోయి వడ దెబ్బకు గురవుతుంటారు. ఓఆర్ఎస్ ప్రాధాన్యతపై కపిలేశ్వరపురం మండలం అంగర పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు ఇలా వివరించారు. శరీరాన్ని నిర్దిష్టమైన ఉష్ణోగ్రతలో ఉంచుకోవాలి. మెదడులో హైపో తలామస్ అనే భాగం శరీరలోని వేడిని క్రమబద్ధీకరిస్తుంది. తగిన నీటిని తాగకపోయినా, ఎండలో ఎక్కువ తిరిగినా హైపో తలామస్ భాగం అధిక ఉష్ణోగ్రతకులోనై క్రమబద్ధీకరించే పనిని చేయలేదు. ఈ స్థితిలో తల తిరగడం, నీరసం, తలనొప్పి, జ్వరం, చీకటి కమ్మినట్టు అనిపించడం, వాంతి అవుతున్న భావన కలగడం వంటి లక్షణాలు వడదెబ్బకు గురైనట్టు నిర్ధారణ చేస్తాయి.

ఓఆర్ఎస్ అనేది వివిధ లవణాల మిశ్రమంతో కూడిన 20.5 గ్రాముల పౌడర్ ప్యాకెట్. దీనిలో 2.6 గ్రాముల సోడియం క్లోరైడ్, 1.5గ్రాముల పొటాషియం క్లోరైడ్, 2.9గ్రాముల సోడియం సిట్రేట్, 13.5 గ్రాముల డెక్స్ట్రోజ్ ఉంటాయి. ఈ పౌడర్ ప్యాకెట్‌ను సురక్షితమైన లీటరు నీటిలో కలిపి రోజు మొత్తంలో వయస్సును బట్టి తగిన మోతాదులో తాగాలి. సమయానికి ఓఆర్ఎస్ ప్యాకెట్ అందుబాటులో లేకపోతే ఇంటిలోనే ఈ ద్రావకాన్ని తయారు చేసుకోవచ్చు. లీటరు నీటిలో చిటికెడు ఉప్పు, చారెడు (అరస్పూన్) పంచదారలను కలిపి సేవించవచ్చు. రెండేళ్ల లోపు వారు 50 నుంచి 100 ఎం.ఎల్.ను ఆరారగా అర స్పూన్ చొప్పున ప్రతి పది నిమిషాలకు ఒకసారి తీసుకోవాలి. రెండు నుంచి పదేళ్ల వారు 100–200 ఎం.ఎల్. (ఒక గ్లాస్) వరకూ ఒక స్పూన్ చొప్పున తాగాలి. పదేళ్ల పైబడిన వారు 50ఎం.ఎల్. (చిన్న గ్లాస్) చొప్పున ఎండలో సంచరిస్తున్న స్థితిగతులను బట్టి తాగుతూ ఉండాలి.



ఓఆర్ఎస్ ప్యాకెట్లు

గడప గడపకూ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- ఏడిదలో గడప గడపకూ మన ప్రభుత్వం

మండపేట: వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఏడిద గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన పార్టీ రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకుడు కర్రి పాపారాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని తదితరులతో కలిసి ఎమ్మెల్సీ తోట గ్రామంలో పర్యటించారు. అంబేడ్కర్ నగర్‌లో ఇంటింటికీ వెళ్లి మూడున్నర సంవత్సరాల్లో ప్రభుత్వ ప్రగతిని ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా?, ఏమైనా సమస్యలున్నాయా? అంటూ స్థానికులను యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఆయన దృష్టికి తెచ్చిన ఆయా సమస్యల పరిష్కారానికి ఎంపీడీఓ ఐ.రాజు, పంచాయతీ ఈఓ వుండమట్ల వీర్రాజు తదితరులకు ఆదేశాలిస్తూ ముందుకు సాగారు. అనంతరం ఎమ్మెల్సీ తోట మీడియాతో మాట్లాడుతూ మూడేళ్లలో చేసిన ప్రగతిని వివరించడంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమయ్యేందుకు చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధిని వలంటీర్లు ఇంటికి వచ్చి అందిస్తున్నారని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, మండల ఆర్‌బీకే కమిటీ డైరెక్టర్ చిలుకూరి బుజ్జి, గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, పార్టీ నాయకులు వల్లూరి రామకృష్ణ, తాతపూడి రాజేష్, బేతా వెంకటేశ్వరరావు, రామిశెట్టి వీర్రాజు, పమిడిపల్లి నానాజీ తదితరులు పాల్గొన్నారు.



ఏడిదలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు

కపిలేశ్వరపురం: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా పడమర ఖండ్రికలో సోమవారం రోగుల ఇళ్లకు వెళ్లి అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్ఎస్‌డి రత్నకుమారి సేవలందజేశారు. ప్రతి నెలా మూడో సోమవారం గ్రామంలో వైద్యసేవలిందిస్తున్నారని, శిబిరానికి వచ్చేందుకు శక్తిలోనే వృద్ధ రోగుల ఇళ్లకు వైద్యులే వచ్చి సేవలందిస్తున్నారని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, కిశోర బాలికలకు పరీక్షలు చేశారు. స్థానిక సచివాలయంలో నిర్వహించిన శిబిరంలో 102 మందికి వైద్య సేవలందించారు. శిబిరాన్ని సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి, గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కవల శ్రీను, నాయకులు కోలపల్లి గోపాలకృష్ణ సందర్శించారు. శిబిరంలో పీహెచ్‌సీ సిబ్బంది సేవలందించారు.

ఆర్థికాభివృద్ధితోనే సమాజ పురోభివృద్ధి

రాయవరం: మహిళలు ఆర్థికంగా శక్తివంతులైనప్పుడే సమాజ పురోభివృద్ధి సాధ్యమవుతుందని, ఈ విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలంగా నమ్ముతున్నారని ఎంపీపీ నౌడు వెంకటరమణ తెలిపారు. వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం నాజర్‌హుస్సేన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ వెంకటరమణ మాట్లాడుతూ మహిళా శక్తి సంఘాల్లో అర్హత ఉన్న ప్రతి మహిళకు రుణం అందించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇచ్చిన హామీనే కాకుండా మేనిఫెస్టోలో ఇవ్వని హామీలను కూడా ప్రభుత్వం నెరవేర్చుతున్న విషయాన్ని యానిమేటర్లు ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం నాజర్‌హుస్సేన్, యానిమేటర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపీపీ వెంకటరమణ, ఎంపీడీవో శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్లు కొండబాబు, ప్రసాద్, యానిమేటర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎం.శ్రీదేవి, అకౌంటెంట్ పుష్ప, యానిమేటర్లు సత్యవేణి, లక్ష్మి, వెంకటలక్ష్మి, సూర్యకుమారి, దేవి, భవాని, రమణమ్మ, ఆదిలక్ష్మి, శిరీష తదితరులు పాల్గొన్నారు.



రాయవరంలో ఎంపీపీ వెంకటరమణను సత్కరిస్తున్న ఏపీఎం నాజర్‌హుస్సేన్, యానిమేటర్లు

ఎమ్మెల్యే వేగుళ్ల తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్టుంది

మండిపడిన ఎమ్మెల్సీ తోట

మండపేట: ఇసుక తవ్వకాల్లో అక్రమాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆరోపణలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మండిపడ్డారు. కపిలేశ్వరపురం మండలంలోని పలు లంక గ్రామాలకు వరద ముంపు నుంచి రక్షణగా ఉన్న పెరుగులంకలోని ఇసుక మేటల్లో ఎమ్మెల్సీ తోట అండదండలతో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని ఆదివారం ఎమ్మెల్యే వేగుళ్ల ఆరోపణలు చేశారు. ఈ విషయమై సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ తోట మీడియాతో మాట్లాడారు. ఇసుక గురించి మాట్లాడే అర్హత ఎమ్మెల్యే వేగుళ్లకు లేదన్నారు. ఆయన చేసిన ఇసుక అక్రమాలపై సొంత ఎల్లో మీడియాలోనే ఇసుకాసురుడంటూ అనేక కథనాలు వచ్చాయన్నారు. టీడీపీ హయాంలో కోరుమిల్లిలో ఇసుక అక్రమ తవ్వకాలు అడ్డుకోబోయిన మహిళలపై పోలీసులతో అమానుషంగా లాఠీ చార్జి చేయించడంతో పాటు స్టేషన్‌లో పెట్టించి చిత్రహింసలకు గురి చేసిన ఘనుడని ఎమ్మెల్యే వేగుళ్లపై తోట మండిపడ్డారు. తాను ఆ రోజు స్టేషన్‌కు వచ్చి మహిళలకు అండగా నిలవకపోతే వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇటీవల వెదురుమూడిలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం ఏర్పాటు విషయంలోను ఎమ్మెల్యే వేగుళ్ల కుల విభేదాలు సృష్టించి లబ్ధిపొందాలని చూశారన్నారు. ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణతో కలిసి బీసీలు కోరుకున్న స్థలంలోనే పూలే విగ్రహ ప్రతిష్ఠ చేయడం ద్వారా రాజకీయ కుట్రలు చేయాలనుకున్న వారి నోళ్లు మూయించామన్నారు. బీసీలకు పెద్దపీట వేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందని, మండపేట మున్సిపాల్టీ చరిత్రలో శెట్టిబలిజ సామాజిక వర్గానికి మున్సిపల్ వైస్ చైర్మన్ చేసింది తామేనని ఎమ్మెల్సీ తోట స్పష్టం చేశారు. మున్సిపాల్టీ ఆవిర్భావం నుంచి గత కౌన్సిల్ వరకూ ఎప్పుడైనా బీసీలకు సముచితం స్థానం కల్పించారా అని ఆయన ప్రశ్నించారు. దశాబ్దాల కాలంగా మండపేటలో బీసీలకు ఎవరు అన్యాయం చేశారో ప్రజలందరికీ తెలుసునని ఎమ్మెల్సీ తోట హితవు పలికారు. మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి, వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్, పట్టణ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు పంపన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

జగనన్న పాలనలోని ప్రతి అంశం చరిత్ర లిఖితమే

కాజులూరు: సీఎం జగన్ పాలనలోని ప్రతి అంశం చరిత్ర లిఖితమౌతుందని వైఎస్సార్ సీపీ నేత, శీల సర్పంచ్ కోమలి వెంకటరమణ అన్నారు. సోమవారం మండలంలోని శీలలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని నిర్వహించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో ఇంటింటికీ వెళ్లి నాడు–నేడు ప్రభుత్వ పాలనలో వ్యత్యాసాలను వివరిస్తూ పార్టీ నుంచి వచ్చిన ప్రశ్నపత్రంలోని ఐదు ప్రశ్నలకు జవాబులు రాబడుతూ ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. స్టిక్కర్లు, కరపత్రాలు పంచిపెట్టారు. సర్పంచ్ వెంకటరమణ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సీఎం జగన్ పాలన సాగుతుందన్నారు. రాష్ట్రానికి ఎందరో ముఖ్యమంత్రులు వచ్చారని అయితే ఇంత భారీ ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలపై గృహసారథులు, కార్యకర్తలు ప్రజల్లో సరైన అవగాహన కల్పించటం ద్వారా మరోసారి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురాగలమన్నారు. కార్యక్రమాల్లో మండల గృహసారథుల కమిటీ చైర్మన్ చింతపల్లి నాగేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు దడాల భీమేశ్వరరావు, దాస్యం సుమన్, నల్లమిల్లి రామారెడ్డి, దొమ్మేటి కొండ తదితరులు పాల్గొన్నారు.



శీలలో జగనన్నే మా భవిష్యత్తులో ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్న పార్టీ నాయకులు

నేడు పూలే, అంబేడ్కర్ జయంత్యుత్సవాల ముగింపు

కపిలేశ్వరపురం: అంగరలో మంగళవారం జ్యోతిరావ్ పూలే, బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల ముగింపు సభను నిర్వహించనున్నట్టు యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి డీవీ రాఘవులు, జిల్లా సహాధ్యక్షుడు పి.సురేంద్రకుమార్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జువ్వల శ్రీనివాస్, ఇల్లూరి సూరిబాబు తెలిపారు. సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన అంబాజీపేటలో ప్రారంభం కాగా మంగళవారంతో ఉత్సవాలు ముగియనున్నాయన్నారు. అంగరలోని శ్రీసిద్ధార్థ కళాశాల మైదానంలో సాయంత్రం 5 గంటలకు నిర్వహించే సభకు పీడీఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ హాజరవుతారన్నారు.

సందడిగా జగనన్నే మా భవిష్యత్తు

మండపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగేళ్ల పాలనపై వైఎస్సార్ సీపీ చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం మండపేట, మండల గ్రామాల్లో ఉత్సాహంగా సాగుతోంది. వాడవాడలా పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు. కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి పట్టణంలోని 20వ వార్డు గొల్లపుంత కాలనీలో పర్యటించారు. పార్టీ నాయకులు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఇచ్చిన ప్రశ్నావళిని ప్రజల ముందుంచి సమాధానాలు రాబట్టారు. టీడీపీ పాలనలో హామీల ఉల్లంఘన, సీఎం జగన్ పాలనలో హామీలకు కట్టుబడి పనిచేస్తున్న వైనాన్ని వివరించారు.



స్థానికులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

నైట్‌హాల్ట్ బస్సులను పునరుద్ధరించాలి

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లిలో ఏపీఎస్ ఆర్టీసీ నైట్ హాల్ట్ బస్సులను పునరుద్ధరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అమలాపురం కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో బీజేపీ నాయకులతో కలసి ఆయన వినతిపత్రం అందించారు. గతంలో నైట్‌హాల్ట్‌లో రెండు బస్సులు ఉండేవని ఇప్పుడు వాటిని తొలగించారని వినతిపత్రంలో పేర్కొన్నారు. తెల్లవారుజామున, రాత్రి సమయంలో బస్సులు లేకపోవడంతో కూలీలు, సాధారణ ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే బస్సులను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

చైర్‌పర్సన్ దుర్గారాణి పరామర్శ

మండపేట: మండపేట మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఇనుమర్తి వీరసుభద్ర కుటుంబ సభ్యులను సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. ఇటీవల వీరసుభద్ర మృతిచెందిన విషయం విదితమే. ఈ సందర్భంగా వారు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

మట్టి తవ్వకాలపై ఫిర్యాదు

మండపేట: కపిలేశ్వరపురం మండలం పెరుగులంక వద్ద జరుగుతున్న అనధికార మట్టి తవ్వకాలపై సోమవారం స్పందన కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షుశుక్లాకు ఫిర్యాదు చేసినట్టు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మట్టి తవ్వకాలను ఆపు చేయించడంతో పాటు నదీ ప్రవాహం మీద ఉన్న రోడ్డును తొలగించాలని అధికారులను ఆదేశించినట్టు ఎమ్మెల్యే ఒక ప్రకటనలో తెలిపారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

రామచంద్రపురం: విజయవాడ బార్ అసోసియేషన్‌కు చెందిన బార్ కౌన్సిల్ సభ్యుడు తదితర సీనియర్ న్యాయవాదులకు రాష్ట్ర సీబీ సీఐడీ పోలీసులు అక్రమ నోటీసులు జారీ చేయడంపై స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం కోర్టు విధులు బహిష్కరించారు. న్యాయవాదులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్, ఉపాధ్యక్షుడు పలివెల సత్యనారాయణ, కోశాధికారి చక్రవర్తి, సహాయ కార్యదర్శి వీర్రెడ్డి జూనియర్ న్యాయవాదులు ప్రతినిధి పృథ్వీ, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.